# మేకార్తి దినపత్రిక

PRGI NO: TGTEL/25/A2356

గురువారం 21-05-2026 | పేజీలు : 6 | వెల రు : 4/- | సంపుటి : 1 సంచిక : 259 | WWW.MEKARTHI DINAPATRIKA.COM



జర్నలిస్టులకు ఆహ్వానం
నూతనంగా ప్రారంభించిన
మేకార్తి దినపత్రిక పత్రికలో
అన్ని జిల్లాలలో స్టాఫర్లుగా,మండలాల్లో విలేకర్లుగా పనిచేయుటకు
జర్నలిస్టులు కావలెను
సంప్రదించాల్సిన నెంబర్స్
9014726022,6302041083


## ఆ శునకాల కారుణ్య మరణానికి అనుమతి: సుప్రీం కీలక ఆదేశాలు



జనసమ్మర్ద ప్రాంతాల నుంచి వీధి కుక్కలను తరలించాలంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలను మార్చాలని కోరుతూ సుప్రీంకోర్టుకు పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిని పరిశీలించిన అత్యున్నత న్యాయస్థానం ఆ అభ్యర్థనలను తోసిపుచ్చింది. గత ఆదేశాలను మార్చేందుకు తిరస్కరించింది. పాఠశాలలు, ఆసుపత్రులు వంటి బహిరంగ ప్రదేశాల నుంచి తరలించిన శునకాలను తిరిగి ఆ ప్రాంతాల్లో వదిలేయొద్దని స్పష్టం చేసింది. వాటి సంతానోత్పత్తిని నియంత్రించేందుకు, ప్రజలకు భద్రత కల్పించడంపైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పలు ఆదేశాలు జారీ చేసింది.

2లో..

## తీవ్ర ఆర్థిక సంక్షోభం రాబోతోంది: రాహుల్ గాంధీ



దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. మున్ముందు చాలా కష్టకాలం రానుందని చెప్పిన ఆయన.. చాలా సంవత్సరాలుగా చూడని తీవ్ర ఆర్థిక సంక్షోభం రాబోతోందన్నారు. అదానీ, అంబానీ వంటి వారిపై ఇది ఎటువంటి ప్రభావం చూపదని.. దేశ యువత, రైతులు, చిన్న వ్యాపారులపైనే తీవ్ర ప్రభావం చూపిస్తుందన్నారు.రెండు రోజుల పర్యటనలో భాగంగా తన సొంత నియోజకవర్గం రాయ్‌బరేలీకి చేరుకున్న రాహుల్.. అక్కడ మీడియాతో మాట్లాడారు. పొదుపు చర్యలకు పిలుపునిచ్చిన ప్రధాని మోదీ వాటిని ఆయన మాత్రం పాటించడం లేదని విమర్శించారు. విదేశాలకు వెళ్లవద్దని చెబుతూ.. ప్రపంచ పర్యటనలు చేస్తున్నారన్నారు.

2లో..



## ఏపీలో వెయ్యి మినీ మార్టులు ఏర్పాటు చేస్తాం: మంత్రి నాదెండ్ల మనోహర్

ఢిల్లీ: రాబోయే రోజుల్లో ఏపీలో వెయ్యి మినీ మార్టులు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రెండో రోజు ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు.

2లో

## తెలంగాణలో శాస్త్రీయంగా వ్యర్థాల నిర్వహణ

### సుస్థిర పట్టణాభివృద్ధి, సర్క్యులర్ ఎకానమి దిశగా చర్యలు




**పక్కాగా ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమం**
**బయో ఎరువులు, విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం**
**స్వచ్ఛ భారత్ మిషన్ జాతీయ సమీక్ష సమావేశంలో భట్టి**

తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన తెలంగాణ విజన్–2047 లక్ష్యాలకు అనుగుణంగా భవిష్యత్ అవసరాలకు సరిపోయే విధంగా, సుస్థిరంగా, సమగ్రంగా, పర్యావరణహితంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి విధానాన్ని అనుసరిస్తోందని, ఇందులో కోర్ అర్బన్ రీజియన్, పెరి అర్బన్ రీజియన్, రూరల్ అగ్రికల్చరల్ రీజియన్‌ల సమతుల్య అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ఘన వ్యర్థాల నిర్వహణ అనేది ఇకపై కేవలం చెత్త సేకరణకు పరిమితం కాదని, అది వాతావరణ మార్పులకు ప్రతిస్పందన, పర్యావరణ సుస్థిరత, సర్క్యులర్ ఎకానమి, ఉపాధి కల్పన, ఆర్థిక ఉత్పాదకతలతో నేరుగా అనుసంధానమై ఉందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పట్టణ పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షతన ప్రారంభమైన రెండు రోజుల 'స్వచ్ఛ భారత్ మిషన్–అర్బన్ 2.0' జాతీయ సమీక్ష సమావేశానికి తెలంగాణ రాష్ట్రం తరపున ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు హాజరయ్యారు. మొదటి రోజు సమావేశంలో దేశంలోని పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, వ్యర్థాల శాస్త్రీయ ప్రాసెసింగ్, పాత చెత్త కుప్పల తొలగింపు, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, పీపీపీ విధానాలు, కొత్త ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. రాష్ట్రాలు, నగరాలు అమలు చేస్తున్న అనుభవాలు, ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకోవడంపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ విధానాలు, సుస్థిర పట్టణాభివృద్ధి చర్యలు, స్వచ్ఛత కార్యక్రమాలు, సర్క్యులర్ ఎకానమి దిశగా చేపడుతున్న కార్యక్రమాలను ఉప ముఖ్యమంత్రి సమావేశంలో వివరించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చిన ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు–2026 దేశంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలో కీలక మార్పుకు దారితీస్తున్నాయని తెలిపారు.

2లో..

## 'నీట్'పై ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నతస్థాయి సమీక్ష



- రీ-నీట్ పరీక్షపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నతస్థాయి సమీక్ష
- కట్టుదిట్టమైన భద్రత, ప్రోటోకాల్‌తో పరీక్ష నిర్వహించాలని అధికారులకు ఆదేశం
- పరీక్షలో పారదర్శకత, సమగ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన
- గత పరీక్షలో గుర్తించిన లోపాలను సరిదిద్దాలని ఆదేశాలు
- కలెక్టర్లు, ఎస్పీలతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని సూచన
- పరీక్షా కేంద్రాల వద్ద భద్రతపై రాజీ పడొద్దని హెచ్చరిక

2లో

## తిరుమలలో భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి



తిరుమల: మూడంతస్తుల భవనంపై నుంచి పడి కార్మికుడు మృతి చెందిన ఘటన తిరుమలలో చోటు చేసుకుంది.

2లో

## పాలమూరు-రంగారెడ్డిని బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసింది: మంత్రి జూపల్లి

- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాప్యం లేకుండా నిధులు కేటాయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ
- ప్రాజెక్టును 90% పూర్తిచేశామని బీఆర్ఎస్ చెప్పడం దారుణమని మంత్రి జూపల్లి వ్యాఖ్య



2లో

## ఆ పిటిషన్లను విచారిస్తాం: సుప్రీంకోర్టు



- హిందూ దేవాలయాలపై రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ అంశంపై పిటిషన్లను విచారించనున్న సుప్రీంకోర్టు
- ఏపీ, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి చట్టాల రాజ్యాంగబద్ధతపై సవాల్
- గతంలో హైకోర్టులను ఆశ్రయించాలని ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించిన సుప్రీంకోర్టు
- గతేడాది ఏప్రిల్‌లో ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకున్న జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం
- దేవాలయాల నిర్వహణపై రాష్ట్ర నియంత్రణ చెల్లుబాటు అంశంపై విచారణ
- కమిషనర్ల అధికారాలు, ట్రస్టీల నియామకాలపై పిటిషన్లలో అభ్యంతరాలు

2లో

## కౌండిన్య స్టడీ సర్కిల్స్, ఫంక్షన్ హాళ్లు ఏర్పాటు చేస్తాం

- గౌడ కులస్తులు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి కృషి చేయాలి
- గీత కార్మికులకు ఆర్థిక భద్రత కల్పించాలి
- ప్రమాద బారిన పడిన కుటుంబాలను ఆదుకోవాలి



**నెల్లూరు నగరం, మే 19 (సదా మీకోసం):** నెల్లూరు నగరంలోని కిసాన్ నగర్ వద్ద ఉన్న సాయి గెస్ట్ హౌస్ నందు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్, రాజ్యసభ సభ్యులు పాక సత్యనారాయణను నెల్లూరు జిల్లా గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తిరకాల సీనయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు పాక సత్యనారాయణ మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో అన్ని నియోజకవర్గాలలో వేలాదిగా ఉన్న గౌడ కులస్తులు అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

2లో..

## తెలంగాణ విజ్ఞప్తి మేరకు.. కేఆర్ఎంబీ సమావేశం మరోమారు వాయిదా

2లో



## డిజిటలైజేషన్‌తో మారుతున్న జర్నలిజం

- ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి
- ఆధునికి సాంకేతికతపై జర్నలిస్టులకు శిక్షణ
- మీడియా అకాడమీ చర్చలో సీనియర్ జర్నలిస్టుల వెల్లడి

నేటి డిజిటల్ యుగంలో జర్నలిజం రంగం వేగంగా మారుతున్న నేపథ్యంలో మీడియా వృత్తిదారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ముందుకు సాగాలని పలువురు సీనియర్ జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. తెలంగాణ, మీడియా అకాడమీ,

2లో..

# రైతులను నిలువునా దోచుకుంటున్న "బ్రోకర్ " కాంగ్రెస్ !

**- మిల్లర్లతో కుమ్మక్కై ఏ గ్రేడ్ ధాన్యాన్ని బి గ్రేడ్ గా మార్చి దోపిడి.**
**- అఫీషియల్ గా కొత్త తరహా దోపిడీ కి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ సర్కార్ తెరలిపింది,**
**- రైతాంగాన్ని ఇంతలా దోచుకుంటున్నందుకు కాంగ్రెస్ సర్కార్ కు సిగ్గుండాలి**
**- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి....**

మేకార్తి దినపత్రిక కరీంనగర్ టౌన్ రిపోర్టర్,మంద జయ ప్రకాష్ రెడ్డి మే 20.



ఆరుగాలం రైతు కష్టించి పండించిన పంటను కొనుగోలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కొర్రీలు పెడుతూ రైతాంగాన్ని ఇబ్బందుల గురి చేస్తుందని, ప్రధానంగా నాణ్యమైన ఏ గ్రేడ్ పంటలను సైతం బి గ్రేడ్ గా మార్చడం , తాలు, తరుగు పేరిట కోతలు విధించి కాంగ్రెస్ సర్కార్ మిల్రర్లతో కుమ్మక్కై రైతులను నిలువు దోపిడీ చేస్తు, కాంగ్రెస్ పెద్ద బ్రోకర్ గా మారిందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఘాటుగా విమర్శించారు. బుధవారం రోజున కొత్తపల్లి మండలంలో పంట కొనుగోలు కేంద్రాలను స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి గంగాడి కృష్ణారెడ్డి పరిశీలించి కాంగ్రెస్ ప్రభుత్వంపై, స్థానిక అధికార యంత్రాంగం తీరు పై ధ్వజమెత్తి మాట్లాడారు. నాణ్యమైన ధాన్యాన్ని కూడా కావాలనే 'బి-గ్రేడ్'గా మారుస్తూ, క్వింటాల్‌కు రూ. 20 చొప్పున ధరలో కోత విధిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మిల్లర్లతో కొమ్మక్కై రైతులను నిలువునా ముంచే కొత్త తరహా దోపిడీకి తెర లేపిందని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ప్రారంభించారని, దీనివల్ల 17% ఉండాల్సిన తేమ శాతం 11%కి పడిపోయిందన్నారు. దీనివల్ల రైతులు క్వింటాల్‌కు అదనంగా 7 కిలోల ధాన్యాన్నినష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఫ్‌సీఐ నిబంధనల కంటే తాలు తక్కువగా ఉన్నప్పటికీ, అధికార పార్టీ అండతో మిల్లర్లు చెలరేగిపోతున్నారని ఆయన ధ్వజమెత్తారు. గత పదేళ్ల టిఆర్ఎస్ పాలనలో సంచికి 5-6 కిలోల తరుగు తీసి రైతులకు అన్యాయం చేసిందని, కాంగ్రెస్ కూడా అదే బాటలో ప్రయాణిస్తుందని , అంతకంటే ఎక్కువ మొత్తంలో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలువు దోపిడీ చేస్తున్నందుకు సిగ్గుండాలన్నారు. జిల్లావ్యాప్తంగా పంట కొనుగోలు మందకొడిగాకొనసాగుతున్నాయని , రైతులకు పంటపై ఏలాంటి ఆంక్షలు , కోతలు విధించకుండా పంట కొనుగోళ్ళను చేపట్టాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ప్రధానంగాఎలాంటి తాలు ,తరుగు కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలనీ, కొనుగోలు కేంద్రాలకు లారీల సంఖ్యను వెంటనే రెట్టింపుచేయాలని,నాణ్యమైన ధాన్యాన్ని బి-గ్రేడ్ కింద కొంటున్న మిల్లర్లపై, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న సివిల్ సప్లై అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని, చీటింగ్ కేసులు నమోదు చేయాలనీ ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అలాగే అకాల వర్షాలతో రైతాంగం పంట నష్టపోకుండా టార్పాలిన్ లను సరఫరా చేయాలని , కాటా చిట్టి ప్రకారమే పేమెంట్ చేయాలని , బి కేటగిరి మోసాలను అరికట్టాలని, రవాణా సౌకర్యం మెరుగుపరచాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అనంతరం మండల తహసిల్దార్ కార్యాలయంలో మండల అధ్యక్షులు కుంట తిరుపతి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి జోన్ అధ్యక్షులు ముత్తునూరి హరీష్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి గారు కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు రాజిరెడ్డి సర్పంచులు కోమటిరెడ్డి అంజన్ కుమార్ నునుగొండ మానస ప్రవీణ్ ఉప సర్పంచ్ అరే నరేష్ కట్ల వెంకటేష్ సెన్సార్ బోర్డు మెంబర్ ఎర్రోళ్ల ప్రదీప్ కుమార్ సీనియర్ నాయకులు గుంజేటి శివకుమార్ జవ్వాజి రమేష్ కించ శేఖర్ సోమిరెడ్డి సత్యనారాయణరెడ్డి హరి ప్రసాద్ కడార్ల రతన్ కుమార్ కట్ల శ్రీనివాస్ సోమినేని కరుణాకర్ ఇల్లెందుల ఆనంద్ మెరుగు మల్లేశం బైరెడ్డి వంశీ కూరగాయల మల్లేశం పాల శీను తదితరులతోపాటు వివిధ గ్రామాల భూత్ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు

## పర్స రాజయ్య భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించిన .

**- భూంపల్లి సర్పంచ్ రంగయ్య గారి జన్నారెడ్డి గారు.**

మేకార్తి దినపత్రిక మే 20 సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ పాపని స్వామి ప్రతినిధి.



సిద్దిపేట జిల్లా అక్బర్ పేట భూంపల్లి మండలం భూంపల్లి గ్రామం.

నిన్నటి రోజు అకస్మాత్తు గా మరణించిన భూంపల్లి గ్రామ వాస్తవ్యులు పర్స రాజయ్య భౌతిక కాయాన్ని. భూంపల్లి సర్పంచ్ రంగయ్య గారి జన్నారెడ్డి సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబీకులను పరామర్శించారు . ఈ సందర్భంలో జన్నారెడ్డి గారితో పర్స స్వామి,సిద్ధిరాములు సార్ మరియు బక్కి రామస్వామి,ఇతరులు ఉన్నారు.

## కౌండిన్య స్టడీ సర్కిల్స్, ఫంక్షన్ హాళ్లు ఏర్పాటు చేస్తాం

మొదటి పేజీ తరువాయి

బీసీ కార్పొరేషన్, సెట్వెల్, జిల్లా కేంద్ర పరిశ్రమల శాఖ, స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా తదితర సంస్థల ద్వారా లబ్ధి పొంది పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కోరారు. గౌడ కులస్తులకు తన వంతు సహాయ సహకారాలను ఎల్లవేళలా అందిస్తానని హామీ ఇచ్చారు. పార్లమెంటులో సైతం దేశంలోని గౌడ్స్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ప్రకటించారు. నూతనంగా జిల్లా గౌడ సంఘం అధ్యక్షులుగా తిరకాల సీనయ్య గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం పట్ల సంతోషం వ్యక్తంచేశారు. జిల్లాలో గౌడ్ భవనాల నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

**సమస్యల పరిష్కారానికి కృషి**

అనంతరం తిరకాల సీనయ్య గౌడ్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో వేలాదిగా ఉన్న గౌడ కులస్తులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ముఖ్యంగా గీత కార్మికులు సరైన వ్యాపారం లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, ప్రాణాలకు సైతం భద్రత కరువై నిత్యం ప్రమాదాల బారిన పడుతూ కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని తెలిపారు. నగరంలో కౌండిన్య కళ్యాణ మండపం, కౌండిన్య స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. నెల్లూరు జిల్లాలో అన్ని నియోజకవర్గాలలో మద్యం, బెల్ట్ షాపుల బెడదను తగ్గించాలని కోరారు. గీత కార్మికులకు మల్టీ ట్రీ క్లైంబర్స్ ప్రభుత్వం ఉచితంగా అందజేయాలని, హెడ్ టార్చ్ లైట్లు, మోటార్ సైకిళ్లు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో చనిపోయిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా, ఇన్సూరెన్స్ తక్షణమే వచ్చేలా కృషి చేయాలని, వారి పిల్లలకు ఉచిత విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వాల పరంగా పెన్షన్లు, సంక్షేమ పథకాలను త్వరితగతిన అందేలా చూడాలని తెలిపారు.

**నాయకుల సంఘీభావం**

ఈ కార్యక్రమంలో గౌడ్ సంఘం నాయకులు అన్నం దయాకర్ గౌడ్, పెంపులూరు భాస్కర్ గౌడ్, తుళ్లూరు మల్లికార్జున గౌడ్, ఏపూరి రమేష్ గౌడ్, ముక్కు రాధాకృష్ణ గౌడ్, జడపల్లి రాజారావు గౌడ్, తిరకాల మోహన్ బాబు గౌడ్ మరియు ఇతర అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పాలమూరు-రంగారెడ్డిని బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసింది: మంత్రి జూపల్లి

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు జాప్యం లేకుండా నిధులు కేటాయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తెలిపారు. ఈ ప్రాజెక్టును 90 శాతం పూర్తిచేసినట్లు బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం దారుణమన్నారు. హైదరాబాద్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు చెందిన మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు సీఎంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు మీడియాతో మాట్లాడారు. హంతకులే దొంగ ఏడుపులు ఏడ్చినట్లు బీఆర్ఎస్ నేతలు 'పాలమూరు పోరుయాత్ర' పేరిట పాదయాత్ర చేస్తామనడం విడ్డూరమని వాకిటి శ్రీహరి అన్నారు. అధికారంలో ఉన్న పదేళ్లలో ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదో చెప్పి ప్రజల వద్దకు వెళ్లాలని హితవు పలికారు. పొర్లుదండాలు పెట్టినా పాలమూరు ప్రజలు ఆ పార్టీని నమ్మరన్నారు. రెండేళ్లలో పాలమూరు-రంగారెడ్డి పూర్తి చేస్తామని గతంలో కేసీఆర్ అన్నారని జూపల్లి గుర్తుచేశారు. రూ.లక్ష కోట్ల ప్రాజెక్టుకు సుమారు రూ.25 వేల కోట్లే ఖర్చు చేశారని చెప్పారు. ఈ ప్రాజెక్టును బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసిందన్నారు. పాదయాత్ర చేసే నైతిక హక్కు బీఆర్ఎస్ నేతలకు లేదని చెప్పారు. ధనిక రాష్ట్రాన్ని అప్పగిస్తే రూ.లక్షల కోట్ల అప్పులు మిగిల్చి ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తిచేయలేదని జూపల్లి విమర్శించారు.

## డిజిటలైజేషన్‌తో మారుతున్న జర్నలిజం

మొదటి పేజీ తరువాయి

చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నాంపల్లిలోని మీడియా అకాడమీ భవనంలో మంగళవారం నిర్వహించిన జర్నలిస్టుల చర్చా కార్యక్రమంలో పలువురు సీనియర్ జర్నలిస్టులు, అకాడమీకి అనుబంధ సభ్యులు పాల్గొని మీడియా రంగ భవిష్యత్ దిశ, డిజిటలైజేషన్, మీడియా చట్టాలు, శిక్షణ కార్యక్రమాలు, జర్నలిస్టుల సంక్షేమ అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సమాచార,పౌర సంబంధాల శాఖ ప్రత్యేక ప్రధాన కమిషనర్ జి. ముకుంద్ రెడ్డి, కార్యక్రమంలో పాల్గొని జర్నలిస్టులను అభినందించారు. జర్నలిజం డిగ్రీ చదివే రోజుల్లో పత్రికల ఎడిటోరియల్స్ చదవడం ద్వారా సివిల్ సర్వీసులపై ఆసక్తి పెరిగిందని, అదే తన విజయానికి పునాది అయిందని తెలిపారు. నేడు మీ అందరి ముందుకు రావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. సమావేశంలో ఐ. వెంకట్ రావు మాట్లాడుతూ మీడియా అకాడమీ చేపడుతున్న కార్యక్రమాలను అభినందిస్తూ మరిన్ని పుస్తకాలను అకాడమీకి అందజేస్తానని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్ మాట్లాడుతూ జర్నలిజం తనకు ధైర్యం, గుర్తింపు ఇచ్చిందని పేర్కొంటూ అకాడమీకి కృతజ్ఞతలు తెలిపారు. ఉదుముల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక జర్నలిజానికి అనుగుణంగా అకాడమీ డిజిటల్ క్లాసులు, ఇంక్యూబేటర్ ఏర్పాటు చేయాలని, గ్యాగ్ ఆర్డర్ వంటి అంశాలపై చర్చలు నిర్వహించాలని సూచించారు. దేవులపల్లి అమర్ మాట్లాడుతూ 16 మంది వెటరన్ జర్నలిస్టుల వీడియోలను పుస్తకాల రూపంలో తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు సభ్యులు మీడియా రంగంలో కృత్రిమ మేధస్సు ప్రభావం పెరుగుతోందని, జర్నలిస్టులు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఆధునిక శిక్షణా కార్యక్రమాలు, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాములు, డెస్క్ జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణలు నిర్వహించాల్సిన

అవసరం ఉందని సూచించారు. అకాడమీ భవనంలోని డిజిటల్ సదుపాయాలు, ఆధునిక ఆడిటోరియం, బోర్డు రూమ్, లైబ్రరీ, కంప్యూటర్ రూమ్ వంటి వసతులను మరింత సమర్థవంతంగా వినియోగించి జర్నలిస్టులకు ప్రయోజనం కలిగించాలని అభిప్రాయపడ్డారు. పాత పత్రికలు, అరుదైన పుస్తకాలు, నిజాం కాలం నాటి ప్రచురణలు, తెలుగు గ్రంథాలు తదితరాలను డిజిటలైజ్ చేసి భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. పలువురు సీనియర్ జర్నలిస్టులు తమ వద్దనున్న విలువైన పుస్తకాలను మీడియా అకాడమీ లైబ్రరీకి విరాళంగా అందిస్తామని తెలిపారు. సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ మీడియా చట్టాలలో కాలానుగుణ మార్పులు అవసరమని, సోషల్ మీడియాకు ప్రత్యేక ప్రవర్తనా నియమావళి తీసుకురావాలని పేర్కొన్నారు. మహిళా జర్నలిస్టులు మరియు గ్రామీణ ప్రాంత జర్నలిస్టుల కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జర్నలిజం అనేది సమాజానికి అద్దం పట్టే వృత్తి అని, భయపడకుండా నిజాయితీతో వార్తలను ప్రజలకు అందించాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. మీడియా అకాడమీ 1996 నుండి జర్నలిస్టుల అభివృద్ధికి విశేష సేవలు అందిస్తోందని, పుస్తక ప్రచురణలు, మోనోగ్రాఫ్‌లు, శిక్షణా కార్యక్రమాలు మీడియా రంగానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని అభినందించారు. చర్చా కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు శ్రీ కె. రాంచందర్ మూర్తి, కేశవరావు దాసు, ఎస్. నాగేష్ కుమార్, డి. అమర్, బండారు శ్రీనివాస్ రావు, రవీందర్ ఎం.పీ., దిలీప్ రెడ్డి, మాడభూషి శ్రీధర్, ఎం. సుబ్బారావు, జగన్, ఆర్.వి. రామారావు,

ఎస్. వినయ్ కుమార్, వై. నరేందర్ రెడ్డి, విరాహత్ అలీ తదితరులు పాల్గొని మీడియా రంగంలో వస్తున్న మార్పులు, డిజిటలైజేషన్, జర్నలిస్టుల శిక్షణ, మీడియా చట్టాలు, సోషల్ మీడియా ప్రభావం, పుస్తక ప్రచురణలు, అకాడమీ భవిష్యత్ కార్యాచరణపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ చేపడుతున్న కార్యక్రమాలను పలువురు ప్రశంసించారు. జర్నలిస్టుల సంక్షేమం, శిక్షణ, డిజిటలైజేషన్, మీడియా ఆధునీకరణ దిశగా అకాడమీ మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన ప్రముఖులందరిని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు శాలువాలతో సీనియర్ జర్నలిస్టులను సత్కరించారు.

## ఏపీలో వెయ్యి మినీ మార్టులు ఏర్పాటు చేస్తాం: మంత్రి నాదెండ్ల మనోహర్

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రానికి చెందిన పలు కీలక అంశాలపై వారితో చర్చించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మినీ మార్టుల ద్వారా మిల్లెట్స్ కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని మనోహర్ తెలిపారు. మినీ మార్టులలో మార్కెట్ ధరల కంటే తక్కువకు నాణ్యమైన సరకులు అందజేస్తామన్నారు. మరోవైపు.. అరకు కాఫీని దేశవ్యాప్తంగా అన్ని మిలిటరీ క్యాంటీన్లలో ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారని మంత్రి వివరించారు.

## తిరుమలలో భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి

మొదటి పేజీ తరువాయి

అవధూత దత్తపీఠం వద్ద వాటర్ ట్యాంక్ మరమ్మతులు చేస్తుండగా.. ప్రమాదవశాత్తూ కాలుజారి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు తమిళనాడులోని తిరుపత్తూర్ వనియంబాడికి చెందిన మణికంఠన్ (35)గా గుర్తించారు. ఘటనపై తిరుమల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 'నీట్'పై ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నతస్థాయి సమీక్ష

మొదటి పేజీ తరువాయి

దిల్లీ: మళ్లీ నిర్వహించనున్న నీట్-యూజీ పరీక్షపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కట్టుదిట్టమైన భద్రత, ప్రొటోకాల్‌తో పరీక్షను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో సమగ్రత, పారదర్శకత అవసరాన్ని గుర్తుచేశారు. గత పరీక్షలో గుర్తించిన లోపాలను పరిష్కరించాలన్నారు. నీట్ పరీక్షపై కలెక్టర్లు, ఎస్పీలతో సమన్వయ సమావేశాలు జరపాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద అప్రమత్తత, భద్రతపై రాజీపడొద్దన్నారు.

నీట్ ప్రశ్నపత్రం లీక్‌పై సీబీఐ విచారణ జరుగుతోందని..ఈ కేసుతో సంబంధం ఉన్న పలువురిని ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారని కేంద్రమంత్రి పేర్కొన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు నష్టపోకూడదనే పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుండేలా చూడటమే మొదటి లక్ష్యమన్నారు. 2026 నీట్ పేపర్ లీక్ కావడంతో మే 3న నిర్వహించిన పరీక్షను రద్దు చేసి, మళ్లీ జూన్ 21న ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఇటీవల వెల్లడించిన విషయం తెలిసిందే.

## ఆ పిటిషన్లను విచారిస్తాం: సుప్రీంకోర్టు

మొదటి పేజీ తరువాయి

దిల్లీ: దక్షిణాదిలోని 3 రాష్ట్రాలు, ఓ కేంద్ర పాలిత ప్రాంతంలో హిందూ దేవాలయాలపై రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ చెల్లుబాటు అంశంలో దాఖలైన పిటిషన్లను విచారణకు స్వీకరిస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. గతంలో దాఖలైన ఈ పిటిషన్ల విషయంలో హైకోర్టులనే ఆశ్రయించాలని ఇచ్చిన ఆదేశాలను ఉపసంహరించుకుంది. గతేడాది ఏప్రిల్‌లో ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంటున్నట్లు జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం ప్రకటించింది.

ఏపీ, తెలంగాణ, తమిళనాడుతో పాటు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో హిందూ దేవాలయాలు, మతపరమైన దానాల నిర్వహణను నియంత్రించే పలు చట్టాల రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ గతంలో సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. కమిషనర్లకు అధికారాలు, ట్రస్టీల నియామకం, ఆలయ ఖాతాల ఆడిట్, మిగులు నిధుల వినియోగం, ఆలయ ఆస్తుల అన్యాక్రాంతం, హిందూ మత సంస్థలపై రాష్ట్ర పర్యవేక్షణ వంటి అంశాలను సవాల్ చేస్తూ ఈ పిటిషన్లు దాఖలయ్యాయి.

## తెలంగాణలో శాస్త్రీయంగా వ్యర్థాల నిర్వహణ

మొదటి పేజీ తరువాయి

కొత్త నిబంధనలు సంప్రదాయ చెత్త సేకరణ, డంపింగ్ విధానాలకే పరిమితం కాకుండా, 4-వే సోర్స్ సెగ్రిగేషన్, వికేంద్రీకృత వ్యర్థాల ప్రాసెసింగ్, పాత డంప్‌యార్డుల శాస్త్రీయ శుద్ధి, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, సర్క్యులర్ ఎకానమీ, వార్డు స్థాయి బాధ్యత, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఈ దిశగా నిబంధనలు అమలులోకి రాకముందే పలు చర్యలు ప్రారంభించిందని వివరించారు. రాష్ట్రంలోని కోర్ అర్బన్ ప్రాంతాల్లో దాదాపు 9,596 ఎలక్ట్రిక్ స్వచ్ఛ ఆటో టిప్పర్లను ప్రవేశపెట్టే పక్రియను తెలంగాణ ప్రభుత్వం చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ వాహనాల ద్వారా మున్సిపల్ కార్యకలాపాల్లో కార్బన్ ఉద్గారాలు తగ్గడంతో పాటు, శుభ్రమైన రవాణా విధానానికి మార్గం సుగమం అవుతుందని అన్నారు. వీటిని 4-వే సోర్స్ సెగ్రిగేషన్‌కు అనుగుణంగా విభజిత చెత్త నిల్వ స్థలాలతో రూపొందిస్తున్నట్లు తెలిపారు. క్యూఆర్ కోడ్ ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఇంటింటి చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా అమలు చేయనున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం వికేంద్రీకృత, పంపిణీ ఆధారిత వ్యర్థాల ప్రాసెసింగ్ వ్యవస్థలకు ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తడి చెత్తను ఉత్పత్తి అయిన ప్రాంతాల సమీపంలోనే ప్రాసెస్ చేయడం, పొడి చెత్తను శాస్త్రీయంగా వేరు చేసి రీసైక్లింగ్ మరియు సర్క్యులర్ ఎకానమీ వ్యవస్థల్లోకి తీసుకురావడం, ల్యాండ్‌ఫిల్ ప్రాంతాలకు కనిష్ట వ్యర్థాలు మాత్రమే చేరేలా చేయడం ప్రభుత్వ విధానమని వివరించారు. తడి చెత్తను నగరాల్లో దూర ప్రాంతాలకు తరలించడం వ్యయభారంతో కూడుకున్నదిగా ఉండటమే కాకుండా, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా కూడా సుస్థిర విధానం కాదని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. అందుకే వికేంద్రీకృత తడి చెత్త ప్రాసెసింగ్ కేంద్రాల ద్వారా స్థానిక స్థాయిలోనే వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. డంప్‌యార్డుల శాస్త్రీయ శుద్ధి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిన అంశమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ డంప్ యార్డ్ విషయంలో ఐఐటీ బాంబే సాంకేతిక సహకారం, సలహా సేవలను పొందుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. దీని లక్ష్యం మొక్కుబడి చర్యలకే పరిమితం కాకుండా, దీర్ఘకాలిక పర్యావరణ నిర్వహణ వ్యూహాన్ని రూపొందించడం, నిరంతర పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయడమని పేర్కొన్నారు. అలాగే ఆటోనగర్ డంప్ సైట్‌లో సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 22 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను బయోమైనింగ్ ద్వారా ప్రాసెస్ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 30 శాతం వ్యర్థాలు ప్రాసెస్ అయ్యాయని వివరించారు. స్వాధీనం చేసుకున్న భూమిని మళ్లీ డంపింగ్ కోసం కాకుండా, భవిష్యత్తులో పార్కులు, క్రీడా సదుపాయాలు, ప్రజా వినియోగ మౌలిక సదుపాయాలుగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు.

# మర్మాముల గ్రామానికి చెందిన విక్కీ జగ్గాని “సెకండ్ ఛాన్స్ ఫౌండేషన్” ద్వారా అనాధలకు రెండో అవకాశం.

మేకార్తి దినపత్రిక మే 20 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

మర్మాముల గ్రామానికి చెందిన విక్కీ జగ్గాని ప్రస్తుతం హైదరాబాద్‌లోని సెకండ్ ఛాన్స్ ఫౌండేషన్ సంస్థలో 2019 సంవత్సరం నుంచి మేనేజర్‌గా సేవలందిస్తున్నారు. ఈ సంస్థ అనాథలు, నిరాశ్రయులు మరియు మరణానికి చేరువలో ఉన్న నిరుపేదలకు సేవలు అందిస్తూ వారికి ఆశ్రయం, ఆహారం, వైద్య సహాయం మరియు మానవతా పరమైన ఆదరణను అందిస్తోంది. విక్కీ జగ్గాని చేర్యాలలోని మహర్షి జూనియర్ కాలేజీలో తన ఇంటర్మీడియట్ విద్యను పూర్తిచేసి, అనంతరం జంగావ్‌లో డిగ్రీ విద్యను పూర్తి చేశారు. చిన్నప్పటి నుంచే సమాజానికి ఉపయోగపడాలనే సంకల్పంతో ఆయన సామాజిక సేవ వైపు అడుగులు వేశారు. గత సంవత్సరం ఆయన తండ్రి మరణం కుటుంబానికి పెద్ద దెబ్బగా మారింది. అయితే ఆ కష్ట సమయంలో సెకండ్ ఛాన్స్ ఫౌండేషన్ స్థాపకుడు జాస్పర్ మరియు ఆయన సతీమణి థెరిసా విక్కీకి అండగా నిలిచి ధైర్యం ఇచ్చారు. వారి ప్రోత్సాహం వల్ల విక్కీ మరింత నిబద్ధతతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. సెకండ్ ఛాన్స్ ఫౌండేషన్ ద్వారా అనాధలు, నిరాశ్రయులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి సహాయం చేయడం మాత్రమే కాకుండా, వారికి గౌరవంతో జీవించే అవకాశం కల్పించడం కూడా ముఖ్య లక్ష్యంగా పని చేస్తున్నారు. అనాధ మృతదేహాలకు గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించడం, వీధుల్లో ఉన్న నిరుపేదలకు ఆహారం అందించడం, అనారోగ్యంతో ఉన్నవారికి వైద్య సహాయం కల్పించడం వంటి సేవా కార్యక్రమాల్లో విక్కీ చురుకుగా పాల్గొంటున్నారు. “దేవుని కృప మరియు నా తండ్రి ఇచ్చిన స్ఫూర్తి వల్లనే నేను ఈ సామాజిక సేవలో కొనసాగుతున్నాను. సమాజంలో అణగారిన వారికి సహాయం చేయడం నా బాధ్యతగా భావిస్తున్నాను” అని విక్కీ జగ్గాని తెలిపారు. సెకండ్ ఛాన్స్ ఫౌండేషన్ హైదరాబాద్ లో పనిచేస్తున్న ఒక సేవా సంస్థ (చీ+ూ). ఈ సంస్థ ప్రధాన లక్ష్యం వీధులపై జీవిస్తున్న నిరాశ్రయులు, వృద్ధులు, మానసిక సమస్యలతో బాధపడుతున్న వారు మరియు సహాయం లేని ప్రజలకు కొత్త జీవితం ఇవ్వడం. “ప్రతి మనిషికి జీవితంలో రెండో అవకాశం అవసరం” అనే ఆలోచనతో ఈ సంస్థ సేవలు అందిస్తోంది. ఈ ఫౌండేషన్ వీధుల్లో బాధపడుతున్న వారిని రక్షించి వారికి ఆశ్రయం, ఆహారం, దుస్తులు, వైద్య సేవలు మరియు ప్రేమను అందిస్తుంది. అనారోగ్యంతో ఉన్నవారికి చికిత్స చేయించి, మానసికంగా బలహీనపడిన వారికి ధైర్యం చెప్పి తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి



ప్రయత్నిస్తుంది. సెకండ్ ఛాన్స్ ఫౌండేషన్ సమాజంలో మానవత్వాన్ని పెంపొందించే గొప్ప సేవ చేస్తోంది. కుటుంబాలు వదిలేసిన వృద్ధులను, అనాథలను మరియు పేదలను ఆదుకుని వారికి గౌరవప్రదమైన జీవితం కల్పిస్తోంది. ఈ సంస్థలో పనిచేసే వాలంటీర్లు ఎంతో ప్రేమతో మరియు సేవాభావంతో ప్రజలకు సహాయం చేస్తున్నారు. ఈ సంస్థ ప్రజల సహకారంతో ముందుకు సాగుతోంది. దానాలు, వాలంటీర్ సేవలు మరియు సామాజిక సేవ కార్యక్రమాల ద్వారా మరింత మందికి సహాయం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ముగింపుగా, సెకండ్ ఛాన్స్ ఫౌండేషన్ అనేది కేవలం ఒక చీ+ూ మాత్రమే కాదు; ఇది ఆశ, ప్రేమ మరియు మానవత్వానికి ప్రతీక. సమాజంలో బాధపడుతున్న వారికి కొత్త ఆశను అందిస్తూ ఎంతో గొప్ప సేవ చేస్తోంది.

# సాయి రూప ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్న ప్రసాదం వాటర్ బాటిల్స్ వితరణ



వేములవాడ, మే 20, మేకార్తి దినపత్రిక ప్రతినిధి :

వేములవాడ పట్టణంలోని రాజన్న ఆలయం ఆవరణంలో సాయిరూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం రోజు న అన్న ప్రసాదం వాటర్ బాటిల్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు పిల్లీ బాబురావు మాట్లాడుతు వారి పేరు మీద అన్న ప్రసాదం వాటర్ బాటిల్స్ ఈ రోజు యాచాకులకి పంపిణి చేయడం జరిగింది అలాగే ప్రతి దాతలకు పేరు పేరు నా ధన్యవాదములు ఈ రోజు మాకు సహకరించిన దాతలు గొనె రేవతి లక్ష్మి నారాయణ గారి పెళ్లి రోజు సందర్బంగా మాకు ఈ కార్యక్రమం సహకరించారు ఈ కార్యక్రమం లో ట్రస్టు కోశాధికారి దూలం భూమేష్ గౌడ్, ఎద్దండి రాజు, వాసాల హరిప్రసాద్ ,గొశీటీ నవీన్ ,ఆదర్శ్,వైష్ణవి, తదితరులు పాల్గొన్నారు...

# బిజెపి నాయకులు ఎమ్మార్వో కు వినతి పత్రం

**- బిజెపి మండల అధ్యక్షుడు కోడె రమేష్ ఆధ్వర్యంలో**

మేకార్తి దినపత్రిక మే 22 గంభీరావుపేట మండల రిపోర్టర్

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మరియు జిల్లా పార్టీ ఆదేశాల మేరకు భాజపా గంభీరావుపేట మండల అధ్యక్షులు కోడె రమేశ్ ఆధ్వర్యంలో ఎమ్మార్వో గారికి వినతి పత్రం ఇచ్చిన అనంతరం కోడె రమేశ్ మాట్లాడుతూ రైతు చెమటను గౌరవించాల్సిన ప్రభుత్వం, నిర్లక్ష్యంతో రోడ్డున పడేసింది. రాష్ట్రంలో రైతుల పండించిన ధాన్యం మరియు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలలో సరిపడా స్థలం లేక రోడ్డుపై మండుటెండలో సైతం ధాన్యాన్ని ఆరబెట్టి కుప్పలు పోసి కొనుగోలు కేంద్రాలలో పలు సమస్యలతో రోజుల తరబడి వేచి ఉండాల్సిన




పరిస్థితి ఏర్పడింది. ధాన్యం కాంటాలు కాకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా ధాన్యం కుప్పలు ఉండడం వల్ల వాహనదారులకు ఏ ఇబ్బంది జరిగినా ప్రభుత్వ అధికారులది మరియు ప్రభుత్వానిదే బాధ్యత. రైతు కష్టం ప్రభుత్వానికి కనిపించడం లేదా ధాన్యం కొనుగోలు చేయడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమవడంతో పాటు ఇప్పటివరకు పచ్చి రొట్టె ఎరువులు ( జీలుగు పెసర వంటివి.) అందించడంలో పూర్తిగా వైఫల్యం చెల్లిందని ప్రజా పాలన అంటూ కాలయాపన చేస్తుంది తప్ప రైతులకు అవసరమైన వాటిని అందించడంలో నిర్లక్ష్యం వహిస్తుందని చెప్పడానికి ఇదే పెద్ద ఉదాహరణ. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే, రైతు వ్యతిరేక ప్రభుత్వంగా చరిత్రలో మిగిలిపోతుందని రైతు ఆవేదనను అర్థం చేసుకోని పాలకులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉంది అన్నారు ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి విగ్నేష్ గౌడ్ ఉపాధ్యక్షులు నర్సింలు రాజు సర్పంచ్ పొన్నాల మహేష్ నాయకులు రాజేందర్ రెడ్డి సర్వోత్తమ్ దేవేందర్ గౌడ్ రవీందర్ దేవేందర్ యాదవ్ మల్లేష్ గౌడ్ పూల్య నాయక్ నర్సింలు శ్రీనివాస్ నవీన్ నాయకులు పాల్గొన్నారు

# మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పరామర్శ

**- కుటుంబానికి అండగా ఉంటామని భరోసా.**



మేకార్తి దినపత్రిక మే 20 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

చేర్యాల మండలం పెద్ద రాజుపేట గ్రామానికి చెందిన ప్రముఖ అడ్వకేట్ ఆంకని సురేందర్ బావ మరాఠీ కిషన్ గుండెపోటుతో అకాల మర ణం చెందారు. విషయం తెలుసుకున్న వెంటనే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి బుధవారం పెద్ద రాజుపేట గ్రామానికి చేరుకుని మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మరాఠీ కిషన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆకస్మిక మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ దుఃఖ సమయం లో ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు తెలిపారు. అలాగే అడ్వకేట్ ఆంకని సురేందర్ ను ప్రత్యేకంగా పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు పార్టీ తరపున, వ్యక్తిగతంగా ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# ప్రభుత్వ ఉద్యోగాల వయోపరిమితి పెంపుపై హర్షం: రాష్ట్ర ప్రభుత్వానికి దళిత రత్న అవార్డు గ్రహీత కర్రోల్ల నవజీవన్ అభినందనలు..

మేకార్తి దినపత్రిక మే 20 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు ఊరటనిస్తూ, గరిష్ఠ వయోపరిమితిని పదేళ్ల పాటు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ‘దళిత రత్న’ అవార్డు గ్రహీత కర్రోల్ల నవజీవన్ తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. నిరుద్యోగుల పక్షాన నిలిచిన రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు మరియు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కర్రోల్ల నవజీవన్ మాట్లాడుతూ... గతంలో పెంచిన వయోపరిమితి గడువు ఈ ఏడాది ఫిబ్రవరితో ముగిసిన నేపథ్యంలో, అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మంగళవారం తాజాగా ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమన్నారు. ఏడాది పాటు జరిగే ప్రత్యక్ష నియామకాలన్నింటికీ ఈ పెంపు వర్తించడం నిరుద్యోగులకు కొండంత అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం జీవో ప్రకారం సవరించిన వయోపరిమితి వివరాలు:జనరల్ అభ్యర్థులకు: గరిష్ఠ వయోపరిమితి 34 ఏళ్ల నుంచి 44 ఏళ్లకు పెంపు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ (జుఔ) వర్గాలకు: 5 ఏళ్ల అదనపు సడలింపుతో 49 ఏళ్లకు పెంపు. దివ్యాంగులకు: 10 ఏళ్ల అదనపు సడలింపుతో 54 ఏళ్లకు పెంపు. గమనిక: పోలీసు, ఎక్సైజ్, అగ్నిమాపక, జైళ్లు, అటవీ శాఖ వంటి యూనిఫాం సర్వీసులకు ఈ వయోపరిమితి పెంపు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. గతంలో 2024 ఫిబ్రవరి 8న ఇచ్చిన గడువు ముగిసిన వెంటనే, సానుకూలంగా స్పందించి మళ్లీ



వయోపరిమితిని పెంచడం ద్వారా నిరుద్యోగుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి మరోసారి నిరూపితమైందని కర్రోల్ల నవజీవన్ కొనియాడారు. ఈ సువర్ణ అవకాశాన్ని అభ్యర్థులందరూ సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

# వేములవాడ పట్టణంలో డ్రగ్స్,గంజాయి నిర్మూలనకు ప్రత్యేక తనిఖీలు.

**- పట్టణ పరిధిలోని కిరాణా, పాన్ షాప్స్,బస్టాండ్ ప్రాంతాలలో నార్కోటిక్ జాగిలంతో తనిఖీలు నిర్వహణ.**

**- మత్తు పదార్థాల విక్రయాలు,రవాణాపై కఠిన చర్యలు తప్పవు.**

వేములవాడ, మే 20, మేకార్తి దినపత్రిక ప్రతినిధి

వేములవాడ పట్టణంలో కిరాణా, పాన్ షాప్స్,బస్టాండ్ పరిసర ప్రాంతాలలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా మరియు విక్రయాలను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ గారి ఆదేశాల



మేరకు ఈరోజు పోలీసు అధికారులు నార్కోటిక్ డాగ్ సహాయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి,అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులు నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజల సహకారంతోనే మత్తు పదార్థాల నిర్మూలన, భద్రతా చర్యలు మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు.

# అల్లుడికి వెండి చెప్పులు....

మేకార్తి దినపత్రిక మే 20 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.

వెండి ధర ఆకాశాన్నంటుతున్న వేళ.. మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి తన అల్లుడి కోసం కిలోన్నర వెండితో ప్రత్యేకంగా రూపొందించిన కొల్హాపురి చెప్పులను కానుకగా అందజేశాడు. ఈ పాదరక్షల కోసం దాదాపు రూ.4 లక్షలకుపైగా ఖర్చుపెట్టారు. కొల్హాపూర్ కు చెందిన ప్రముఖ చర్మకారుడు విక్రాంత్ మాలి దాదాపు ఎనిమిది రోజులు శ్రమించి ఈ ప్రత్యేక చెప్పులను రూపొందించాడు.



# రూ.1000 లంచానికి లక్ష బహుమతి.. సీఎం విజయ్ సంచలన నిర్ణయం..

మేకార్తి దినపత్రిక మే 20 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ.




తమిళనాడు ప్రభుత్వం సరికొత్త ప్రోత్సాహక పథకాన్ని అధికారికంగా ప్రకటించింది. ఈ నూతన విధానం ప్రకారం ఏ ప్రభుత్వ శాఖలోనైనా సరే,మీ నుండి కేవలం రూ.1000 లంచం డిమాండ్ చేసినా.. ప్రజలు సాక్ష్యాధారాలతో స్వేచ్ఛగా ఫిర్యాదు చేయవచ్చు.లంచాలు అడిగే అధికారులపై సరైన ఆధారాలతో ఫిర్యాదు చేసిన పౌరులకు ప్రభుత్వం తరఫున రూ.1,00,000 నగదు బహుమతి ఇస్తామని సంచలన ప్రకటన చేసింది.ఇందుకోసం 24 గంటలూ అందుబాటులో ఉండేలా 1800 425 1555 అనే ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్‌ను కూడా ప్రవేశపెట్టింది.ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని పూర్తిగా నిర్మూలించడానికి ప్రజలను భాగస్వాములను చేస్తూ తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# ధాన్యం నిల్వ చేసేందుకు గోదాంలను సిద్ధం చేయాలి

- ధాన్యం తరలించేందుకు వాహనాలు, లోడింగ్, అన్ లోడింగ్ కు హమాలీల సంఖ్యను ఇంకా పెంచాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ధాన్యం కొనుగోలు ప్రక్రియపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్

మేకార్తి దినపత్రిక మే -20 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

ధాన్యం నిల్వ చేసేందుకు జిల్లాలో అందుబాటులో ఉన్న గోదాంలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

ధాన్యం సేకరణ, గోదాంల వినియోగం, తూకం వేసిన బస్తాల తరలింపు, వాహనాలు, హమాలీల సంఖ్య పెంపు, మిల్లుల్లో ధాన్యం అన్ లోడింగ్, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేయడం, సన్న రకాల సాగుపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడం, తదితర అంశాలపై బుధవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాల, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా,



వ్యవసాయ, తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో ఇప్పటి వరకు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగుతుందని, చివరి గింజ వరకు కొనుగోలు చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని, రైతులకు క్షేత్ర స్థాయిలో భరోసా కల్పించాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రోజువారీగా సేకరణలో పురోగతి పెంచడంపై దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఉన్న గోదాంలను వినియోగంలోకి తీసుకువచ్చి, ధాన్యం నిల్వ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.తూకం వేసిన ధాన్యం బస్తాలను వాహనాల ద్వారా తరలించడం, దీని కోసం సరిపడా వాహనాలు సమకూర్చేలా సంబంధిత ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని సూచించారు.హమాలీల సంఖ్యను మరింత పెంచి ధాన్యం లోడింగ్, మిల్లులు, అపరల్ పార్కులో అన్ లోడింగ్ చేయడంలో వేగం పెంచాలని ఆదేశించారు.రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించి ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. సన్న రకం వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, వచ్చే సీజన్ లో రైతులు సన్న రకం వరి సాగు చేసేలా సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో అవగాహన, విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. అకాల వర్షాలు పడితే ఇబ్బందులు కలగకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, త్వరితగతిన ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులు పని చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

# వేములవాడ రూరల్ బిజెపి పార్టీ ఆధ్వర్యంలో తాసిల్దార్ కి వినతిపత్రం

వేములవాడ, మే 20, మేకార్తి దినపత్రిక ప్రతినిధి



గత నెల రోజుల నుండి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కనీస మౌలిక వసతుల లేమితో వరి ధాన్యం కొనుగోలులో జరుగుతున్న జాప్యాన్ని కావలసినన్ని గన్ని బ్యాగులు సమకూర్చి ధాన్యం కాంటాను వేగవంతం చేయాలని కాంటావేసిన ధాన్యాన్ని తరలించే లారీలు అమాలీలు కొరత మరియు ఇటు కొనుగోలు కేంద్రంలో అటు రైస్ మిల్లర్ల వద్ద తరుగు తేమ పేరుతో దోపిడీకి గురవుతున్న రైతును తక్షణమే ఆదుకోవాలని. రైతుకు ఒక్క గింజ ధాన్యం నష్టం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చెయ్యాలని వారం రోజుల్లోగా రైతుల ఖాతాలో డబ్బులు జమ చేసే విధంగా కృషి చేయాలని లేని పక్షంలో బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తూ వేములవాడ రూరల్ భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు బూరుగుపల్లి పరమేష్ స్థానిక తాసిల్దార్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధికార ప్రతినిధి సుంకరి నరేందర్ ప్రధాన కార్యదర్శి తోట శేఖర్ ఉపాధ్యక్షులు గుంటి వంశీకృష్ణ కార్యదర్శి గుమ్మడి శ్రీనివాస్ బూత్ అధ్యక్షులు నల్లా వెంకట్ రెడ్డి పంచేరుపుల మహేష్ సాగర్ల నరేష్ లింగంపల్లి రాజు కల్లెడ్ల నరేష్ సీనియర్ నాయకులు తుం రమేష్ ఆవునూరు తిరుపతి చింతకుంట గౌతమ్ గోపు రమేష్ అడ్డిక సంతోష్ రెడ్డి సండే సారీ శ్రీనివాస్ ఎంద్ర్యాల ప్రవీణ్ ఎంద్ర్యాల నవీన్ మారాజు దిలీప్ నాయకులు పాల్గొన్నారు

# కొడుకు అరెస్ట్ కొత్త పార్టీపై బండి సంజయ్ సంచలన ప్రకటన

మేకార్తి దినపత్రిక మే ప్రతినిధి

తాను కొత్త పార్టీ పెట్టే ఫాల్తు రాజకీయ నాయకుడిని కాదన్నారు కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్. సోషల్ మీడియాలో కొందరు చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని స్పష్టం చేశారు హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫాల్తు రాజకీయ నాయకుడిని కాదు నేను కొత్త పార్టీ పెట్టే ఫాల్తు రాజకీయ నాయకుడిని కాదు. నేనేంటో, నా ప్రాణపదమైన బీజేపీ కార్యకర్తలకు బాగా తెలుసు. ఒక కమిట్మెంట్తో పనిచేసే కార్యకర్తను నేను. చనిపోయాక నా శరీరంపై బీజేపీ జెండా కప్పాలని కోరుకునే వ్యక్తిని" అని ఎమోషనల్ అయ్యారు. ఎవరెవరో రాసే రాతలను కార్యకర్తలు ఎవరూ పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు.తన కొడుకు వివాదానికి సంబంధించిన కేసు ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని బండి సంజయ్ తెలిపారు. ఈ సందర్భంగా కేసీఆర్ కుటుంబంపై ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఒక తండ్రి తన



కొడుకును చట్టానికి అప్పగించిన సందర్భం ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించారు. కేసీఆర్ ఫామ్ హౌస్లో కూర్చొని తనను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని మాట్లాడుతున్నారని, ఆయన కొడుకు ఒక ఫేక్ మీడియా ఫ్యాక్టరీ నడిపిస్తూ తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో కేసీఆర్ అహంకార గడీల పాలనను కూల్చింది తామేనని బండి సంజయ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.కేంద్ర కేబినెట్ విస్తరణ కేసీఆర్ ఫామ్ హౌస్లో ఉండి నిర్ణయిస్తున్నారా అని సంజయ్ ప్రశ్నించారు. పార్లమెంట్లో వాళ్లకు ఒక్క ఎంపీ సీటు కూడా లేదని, మరి ఆయన డిమాండ్ చేస్తే బర్తరఫ్ చేసే స్థాయిలో బీజేపీ ఉందా అని సంజయ్ నిలదీశారు. సంజయ్ చేసిన ఈ కామెంట్స్ రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది.

# కొనుగోలు కేంద్రాలలో గన్ని సంచులు లేక రోడ్డెక్కిన అన్నదాతలు

మేకార్తి దినపత్రిక మే 20 గంభీరావుపేట మండల రిపోర్టర్

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద కామారెడ్డి సిద్దిపేట ప్రధాన రహదారిపై ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ధాన్యం తూకం వేయడానికి సరిపడా గన్ని సంచులు లేవని, ఇలా అయితే దాన్యం తూకం ఎప్పుడు వేస్తారని రోడ్డుపై దాన్యం పోసి నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కార్ రైతులను ఉసురుపోసుకుంటుందని కష్టపడి పండించిన పంటను కొనే దిక్కులేక కన్నీళ్లు పెట్టిస్తున్నారు కొనుగోలు కేంద్రంలో పోసిన వడ్లను కాపాడుకోవడానికి రోజులు తరబడి ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ అక్కడే పడిగాపులు



కాస్తున్నారు . ఓపిక నశించి సర్కారు నిర్లక్ష్యంపై అగ్రహం వ్యక్తం చేశారు. ఇంతవరకు మార్కెట్ చైర్మన్ మా వద్దకు రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రారంభం నాడు వచ్చింది తప్ప ఇంతవరకు రైతులను కన్నెత్తి కూడా చూడలేదని రైతులు ఆరోపించారు. గత నెల రోజుల నుండి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస మౌలిక వసంతం లేవని వరి ధాన్యం కొనుగోలు జరుగుతున్న. కావలసినన్ని గన్ని బ్యాగులు సమకూర్చి ధాన్యం కాంటను వేగవంతం చేయాలని కాంటవేసిన ధాన్యాన్ని తరలించే లారీలు. ట్రాక్టర్లను హమాలీల కొరత మరియు కొనుగోలు కేంద్రంలో లేకుండా చూడాలని అటు రైస్ మిల్లర్ల వద్ద తరుగు తేమ పేరుతో దోపిడీకి గురవుతున్న రైతన్నను తక్షణమే ఆదుకోవాలని రైతుకు ఒక గింజ ధాన్యం నష్టం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతుల కోరారు కాంటలై నెలలు గడుస్తున్న డబ్బులు పడడం లేదని రైతుల ఆరోపించారు సంఘటన స్థలానికి ఎస్సై అనిల్ కుమార్ చేరుకొని రైతులకు సర్దుబాటు చెప్పి ధర్నా విరమింప చేశాడు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు

# సాయి రూప ట్రస్ట్ ఆధ్వర్యంలో లిఅన్న ప్రసాదం వాటర్ బాటిల్స్ వితరణ



వేములవాడ, మే 20, మేకార్తి దినపత్రిక ప్రతినిధి :

వేములవాడ పట్టణంలోని రాజన్న ఆలయం ఆవరణంలో సాయిరూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం రోజు న అన్న ప్రసాదం వాటర్ బాటిల్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు పిల్లీ బాబురావు మాట్లాడుతు వారి పేరు మీద అన్న ప్రసాదం వాటర్ బాటిల్స్ ఈ రోజు యాచాకులకి పంపిణి చేయడం జరిగింది అలాగే ప్రతి దాతలకు పేరు పేరు నా ధన్యవాదములు ఈ రోజు మాకు సహకరించిన దాతలు గొనె రేవతి లక్ష్మి నారాయణ గారి పెల్లి రోజు సందర్భంగా మాకు ఈ కార్యక్రమం సహకరించారు ఈ కార్యక్రమం లో ట్రస్టు కోశాధికారి దూలం భూమేష్ గౌడ్, ఎద్దండి రాజు, వాసాల హరిప్రసాద్ ,గౌశీటీ నవీన్ ,ఆదర్శ్,వైష్ణవి, తదితరులు పాల్గొన్నారు...

# మెడికల్ దుకాణాల బంద్ విజయవంతం.

మేకార్తి దినపత్రిక మే 20 సిద్దిపేట జిల్లా బ్యూరో కర్రోల్ల అన్నమ్మ

సిద్దిపేట: ఆన్లైన్ ద్వారా మందుల విక్రయాలను నిలిపివేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా నిర్వహించిన బంద్ విజయవంతం అయిందని సిద్దిపేట జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్ అన్నారు బుధవారం రోజున దేశవ్యాప్తంగా తలపెట్టిన ఒక్కరోజు బందు విజయవంతం అయిందని అన్నారు. ఆన్లైన్ ద్వారా మందుల విక్రయాలు మరియు కార్పోరేట్ కంపెనీల అధిక డిస్కౌంట్ ల వల్ల తమ వ్యాపారాలు నష్టపోతున్నామని దీనిలో భాగంగా ఒకరోజు దేశవ్యాప్తంగా బంద్కు




పిలుపునివ్వడం జరిగిందని ఈ బందులో దాదాపు జిల్లా వ్యాప్తంగా 700 వందల మందుల దుకాణదారులు పాల్గొన్నారు అని ఇకనైనా తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఫార్మసీ విధానం కార్పొరేట్ కంపెనీల డిస్కౌంట్ ఇవ్వకుండా నిరోధించాలన్నారు. స్థానికంగా ఉంటూ లక్షలాది రూపాయలు పెట్టుబడులు దుకాణాలు పెట్టి పెట్టి తమకు లక్షల్లో నష్టాలు వస్తున్నాయన్నారు అంతేకాకుండా అధిక డిస్కౌంట్ ఇవ్వడం ద్వారా నాన్యమైన మందులు ప్రజలకు దక్కడం లేదని అలాగే ఆన్లైన్ ద్వారా డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల విక్రయాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తు . ఒకరోజు బందుకు సహకరించిన ప్రజలకు మరియు రోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇట్టి బందులో జిల్లా హోల్ సేల్ షాపు నిర్వాహకులు చింత సతీష్, మాంకాల శ్రీనివాస్, లక్ష్మీ సాయి శ్రీనివాస్, చంద రమేష్ మరియు కల్వ శ్రీధర్ తదితరులు కూడా పాల్గొన్నారు.

# గ్రామాభివృద్దే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**- బండపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**
**- గ్రామాభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు..**

మేకార్తి దినపత్రిక, మే 20 చందుర్తి మండల రిపోర్టర్.

చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బుధవారం భూమి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలే దేశానికి పట్టు కొమ్మలని,



గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వంలో గ్రామీణాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు, 2009 సంవత్సరానికి ముందు బండపల్లి రిజర్వాయర్ ను నిర్మించినట్లు గుర్తు చేశారు, బండపల్లి గ్రామానికి అదనపు బస్సు సౌకర్యం, వడ్డెర కాలనీకి సిసి రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు, గ్రామంలో మిగిలిపోయిన పనులను విడతలవారీగా పూర్తి చేస్తామన్నారు, ఎన్నికల ముందు ఇచ్చిన ఐదు గ్యారెంటీలను అమలు చేశామని, త్వరలో మరో గ్యారంటీ అర్హులందరికీ నూతన పెన్షన్ అందిస్తామని తెలిపారు, రెండవ విడత ఇందిరమ్మ గృహ నిర్మాణాల కార్యక్రమం త్వరలోనే ప్రారంభమవుతుందని తెలిపారు, అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు తీసుకు వెళ్తున్నారు అన్నారు, ఈ కార్యక్రమంలో తహసిల్దార్ భూపతి, ఎంపీడీవో రాధ గ్రామ సర్పంచ్ కటకం మల్లేశం మాజీ జెడ్పిటిసి నాగం కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గో ప్రభాకర్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతపంటి రామస్వామి ఉప సర్పంచ్ ఇసాక్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఏనుగుల లచ్చిరెడ్డి నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

# ఐ కే పీ సెంటర్లను తనిఖీ చేసిన ఏ యం సి. చైర్మన్.విజయ్ రెడ్డి.

మేకార్తి దినపత్రిక మే 20 సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ పాపని స్వామి ప్రతినిధి.

సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని జెప్తి లింగారెడ్డి పల్లి,వెంకట్రావుపేట,చందాపూర్,రాంపూర్,తొగుట హెడ్ క్వార్టర్,తుక్కపూర్ గ్రామాలలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్) స్థానిక అధికారులతో కలసి సుడిగాలి తనిఖీ చేసి నేరుగా రైతులతో ఐకెపి సెంటర్లను సందర్శించారు. ఎన్నికలప్పుడు మాత్రమే పార్టీ జెండాలు పట్టుకోండి ఇప్పుడు జెండాలు అని పక్కన పెట్టి రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రతి ధాన్యం గింజను కొనుగోలు కేంద్రాలలో రైతుల జెండా పట్టుకొని. రైతుల శ్రేయస్సు కోసం పనిచేయాలని కోరారు లారీల కొరతతో వడ్లు ఆలస్యం అవుతుంది అని రైతులు తమ దృష్టికి తెచ్చారు. వెంటనే జిల్లా పోలీస్ రెవెన్యూ అధికారులతో మాట్లాడి ట్రాన్స్పోర్ట్ ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు,మీ మీ గ్రామలలో ఉన్న డీసీఎం ద్వారా వడ్లను పంపిస్తే మిల్లుల వద్ద దింపించే బాధ్యత నాది అని చెప్పారు.కార్యక్రమంలో ఘాజీ బాబురావు, ఏ యం సి మార్కెట్ కోపరేటివ్ కమిటీ కార్యదర్శి స్వామి,సునీల్, సర్పంచులు రవీందర్,పాగాల శోభా కొండల్ రెడ్డి,బండారు కవిత స్వామి గౌడ్, ఏ యం సి.మార్కెట్ వైస్ చైర్మన్ కొంగరీ నర్సింలు, ఏ యం సి.డైరెక్టర్లు కొండల్ రెడ్డి,చందా సత్తయ్య, బెజ్జనబోయిన రాములు ఆత్మ కమిటీ డైరెక్టర్లు ప్రవీణ్ ,సంతోష్,సిసి లు స్వర్ణలత,చారి,భవానీ, జూా భాస్కర్, సుధా,



లక్ష్మీ, సీనియర్ నాయకులు భూపాల్ రెడ్డి,పంది రాజు,బెజ్జనబోయిన అనిల్,గ్రామ పార్టీ అధ్యక్షులు భారత్ తేజ, బండారు రమేష్ గౌడ్, నాయకులు భాను చందర్,ప్రశాంత్,దుర్గయ్య,బిక్షపతి,రమేష్,నారా యణ తదితరులు పాల్గొన్నారు...

# గంభీరావుపేట మండలంలో మెడికల్ దుకాణాల బంద్ విజయవంతం

మేకార్తి దినపత్రిక మే 20 గంభీరావుపేట మండల రిపోర్టర్

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో మెడికల్ మందుల దుకాణాలు బంద్ విజయవంతం.ఆన్లైన్ ద్వారా మందుల విక్రయాలను నిలిపివేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా నిర్వహించిన బంద్ విజయవంతం అయిందని గంభీరావుపేట మండలం కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ మండల. అధ్యక్షులు చింత వెంకటేశం అన్నారు బుధవారం రోజున దేశవ్యాప్తంగా తలపెట్టిన ఒక్కరోజు బంద్ విజయవంతం అయిందని అన్నారు. ఆన్లైన్ ద్వారా మందుల విక్రయాలు మరియు కార్పొరేట్ కంపెనీల అధిక డిస్కౌంట్ ల వల్ల తమ వ్యాపారాలు నష్టపోతున్నామని






దీనిలో భాగంగా ఒకరోజు దేశవ్యాప్తంగా బందు కు పిలుపునివ్వడం జరిగిందని ఈ బందులో దాదాపు మండల వ్యాప్తంగా మందుల దుకాణదారులు పాల్గొన్నారు అని ఇకనైనా తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఫార్మసీ విధానం కార్పొరేట్ కంపెనీల డిస్కౌంట్ ఇవ్వకుండా నిరోధించాలన్నారు. స్థానికంగా ఉంటూ లక్షలాది రూపాయలు పెట్టుబడులు దుకాణాలు పెట్టి పెట్టి తమకు లక్షల్లో నష్టాలు వస్తున్నాయన్నారు అంతేకాకుండా అధిక డిస్కౌంట్ ఇవ్వడం ద్వారా నాన్యమైన మందులు ప్రజలకు దక్కడం లేదని అలాగే ఆన్లైన్ ద్వారా డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల విక్రయాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తు . ఒకరోజు బందుకు సహకరించిన ప్రజలకు మరియు రోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇట్టి బందులో షాపు నిర్వాహకులు. చింత వెంకటేశం , ఈరవేణి సంజీవ్. చింత చిరంజీవి. గంట అశోక్. పందిరి శ్రీనివాస్. పందిరి రాము , కార్తీక్. గడ్డం బాలు. గంట అజయ్. నరేష్. తదితరులు కూడా పాల్గొన్నారు.

# వరుస దేవాలయ దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడు అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు

మేకార్తి దినపత్రిక మే 20 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

నిందుతుని వద్ద బంగారు పుస్తెలు,వెండి కళ్ళు, నగదు రూ. 2,000/-, కార్ జాకి మరియు స్పీకర్లు స్వాధీనం.నిందితునిపై చందుర్తి సర్కిల్ పరిధిలో ఏడు కేసులు నమోదు.వివరాలు వెల్లడించిన చందుర్తి సర్కిల్ సి.ఐ రవీందర్.నిందుతుని వివరాలు. 1.మోకినపల్లి బాబు,తండ్రి దేవయ్య, వయస్సు 36సం.,కొనరావుపేట మండలం పల్లిమక్త గ్రామం. ఈసందర్భంగా సి.ఐ మాట్లాడుతూ...కొనరావుపేట మండలం పల్లిమక్త గ్రామానికి చెందిన మోకినపల్లి బాబు,తండ్రి దేవయ్య, వయస్సు 36 సంవత్సరాలు అనే వ్యక్తి జల్సాలకు అలవాటు పడి సులభమార్గంలో డబ్బులు సంపాదించాలనుకొని నిర్ణయించుకొని సుద్దాల ఎల్లమ్మ దేవాలయంలో, కొలనూరు ఎల్లమ్మ దేవాలయంలో, నిజామాబాద్ పెద్దమ్మ






దేవాలయంలో, కొండాపూర్ పెద్దమ్మ దేవాలయంలో, భూక్యారెడ్డి తండా జగదాంబ దేవాలయంలో, రామన్నపేట దాసాంజనేయ దేవాలయంలో మరియు రుద్రంగి మండలం మడేలయ్య దేవాలయలలో దొంగతనాలకి పాల్పడి, జల్సాలు చేసి, మిగిలిన దొంగిలించిన సొత్తును వేములవాడలో విక్రయించేందుకు వెళుతుండగా పల్లిమక్త గ్రామ శివారులో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా పోలీస్ వారిని చూసి పరిపోతుండగా మోకినపల్లి బాబు ని అదుపులోకి తీసుకొని సుద్దాల ఎల్లమ్మ దేవాలయంలో దొంగలించిన రెండు స్పీకర్లు, ఒక కార్ జాకీ, బంగారు పుస్తెలు, నగదు రూ. 2,000/-, నిజామాబాద్ పెద్దమ్మ దేవాలయంలో దొంగలించిన వెండి కళ్ళు స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు.నిందుతున్ని పట్టుకోవడంలో కృషి చేసిన కొనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి, పోలీస్ కానిస్టేబుళ్లు విశాల్, జగన్, నాగరాజు లను సి.ఐ అభినందించారు.

# నిరుపేద పద్మశాలి బిడ్డ ప్రాణాలు కాపాడండి

**- ప్రాణ రక్షణ కోసం వేడుకుంటున్నాం**




మేకార్తి దినపత్రిక మే 20 ప్రతినిధి

నిరుపేద పద్మశాలి కుటుంబానికి చెందిన 28 సంవత్సరాల జిందం కవిత తీవ్రమైన అనారోగ్యంతో ప్రస్తుతం కరీంనగర్‌లోని మేడ్ కేర్ హాస్పిటల్ లో ఐసీయూలో చికిత్స పొందుతున్నారు.ఆమె పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో దయచేసి ఎవరైనా సహృదయులు స్పందించి చికిత్స ఖర్చులకు సహాయం చేయండి. అలాగే మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిజం ఎస్ ఇన్స్టిట్యూట్ ఓఫ్ మెడికల్ నిమ్స్ కు తరలించేందుకు సహకరించి ఆ పద్మశాలి బిడ్డ ప్రాణం కాపాడండి. మీ చిన్న సహాయం కూడా ఒక ప్రాణానికి ఆశాకిరణం అవుతుంది.

# భీమేశ్వర స్వామి ఆలయంలో ఆరు రోజుల హుండీ ఆదాయం రూ.83,09,269/- నగదు



వేములవాడ, మే 20, మేకార్తి దినపత్రిక ప్రతినిధి :

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం లో భక్తులు సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఈరోజు ఆలయ అధికారులు లెక్కించారు.గత 44 రోజుల కాలంలో భాగంగా ఈరోజు విప్పిన ఆరు రోజుల హుండీల లెక్కింపులో మొత్తం రూ. 83,09,269/- నగదు రూపంలో ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అదేవిధంగా మిశ్రమ బంగారం 23 గ్రాములు, మిశ్రమ వెండి 3 కిలోల 900 గ్రాములు వచ్చినట్లు తెలిపారు.భక్తులు స్వామివారిపై ఉన్న అపార విశ్వాసంతో పెద్ద ఎత్తున కానుకలు సమర్పిస్తున్నారని ఆలయ అధికారులు పేర్కొన్నారు. వేసవి సెలవులు, ప్రత్యేక పూజలు, శుభదినాల సందర్భంగా ఆలయానికి భక్తుల రద్దీ అధికంగా కొనసాగుతోందని తెలిపారు.ఈ హుండీ లెక్కింపును ఆలయ ఈవో రమాదేవి, కరీంనగర్ ఏసీ కార్యాలయానికి చెందిన రాజమౌళి పర్యవేక్షణలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సహాయ కార్యనిర్వహణాధికారులు, అధికారులు, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది, పోలీస్ సిబ్బందితో పాటు శివరామకృష్ణ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

# మెడికల్ షాపుల బంద్

**- ఆన్‌లైన్ మందుల అమ్మకాలపై నిరసన**
**- తెలిపిన మేడ్చల్ షాప్ యజమానులు**

మేకార్తి దినపత్రిక మే 20 ముస్తాబాద్

ఆన్‌లైన్‌లో మెడిసిన్ విక్రయాలను వ్యతిరేకిస్తూ ముస్తాబాద్ పట్టణంలోని మెడికల్ షాప్ యజమానులు బుధవారం ఒక్కరోజు స్వచ్ఛంద బంద్ చేపట్టారు. ఆన్‌లైన్ ఫార్మసీల వల్ల చిన్న వ్యాపారులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే నియంత్రణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# రాత్రిళ్ళు జోరుగా ఇసుక తరలింపు

**- అక్రమ ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవు**
**- గన్నేరువరం ఎస్సై జి. నరేందర్ రెడ్డి**



మేకార్తి దినపత్రిక( మే 20) గన్నేరువరం మండల ప్రతినిధి

గన్నేరువరం మండలంలోని చోక్కారావుపల్లె బిక్కవాగు నుంచి రాత్రి వేళల్లో ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు జోరుగా ఇసుక తరలిస్తున్నారు.రాత్రి పది గంటల దాటిన తర్వాత ఇసుక భాక సురులు ఇసుకను యదేచ్ఛగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో ఇసుక ట్రాక్టర్ కు సుమారు రూ.3000 రూపాయల నుంచి 6000 రూపాయల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం ఉదయం. చోక్కారావుపల్లె నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న గన్నేరువరం గ్రామానికి చెందిన జీల మధు,దాసరి రాజేష్, మహంకాళి కృష్ణలకు చెందిన మూడు ట్రాక్టర్లను గన్నేరువరం పోలీసులు పట్టుకొని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఇలా ఇసుక తరలించడంపై ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళలో అక్రమ ఇసుక రవాణా వలన నిద్ర పట్టడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి రాత్రివేళ ఇసుక తరలింపును అడ్డుకోవాలని వారు కోరుతున్నారు.

# కొనుగోలు కేంద్రాలలో గన్ని సంచులు లేక రోడ్డెక్కిన అన్నదాతలు

మేకార్తి దినపత్రిక మే 20 గంభీరావుపేట మండల రిపోర్టర్



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద కామారెడ్డి సిద్దిపేట ప్రధాన రహదారిపై ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ధాన్యం తూకం వేయడానికి సరిపడా గన్ని సంచులు లేవని, ఇలా అయితే దాన్యం తూకం ఎప్పుడు వేస్తారని రోడ్డుపై దాన్యం పోసి నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కార్ రైతులను ఉసురుపోసుకుంటుందని కష్టపడి పండించిన పంటను కొనే దిక్కులేక కన్నీళ్లు పెట్టిస్తున్నారు కొనుగోలు కేంద్రంలో పోసిన వడ్లను కాపాడుకోవడానికి రోజులు తరబడి ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ అక్కడే పడిగాపులు కాస్తున్నారు . ఓపిక నశించి సర్కారు నిర్లక్ష్యంపై అగ్రహం వ్యక్తం చేశారు. ఇంతవరకు మార్కెట్ చైర్మన్ మా వద్దకు రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రారంభం నాడు వచ్చింది తప్ప ఇంతవరకు రైతులను కన్నెత్తి కూడా చూడలేదని రైతులు ఆరోపించారు. గత నెల రోజుల నుండి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస మౌలిక వసంతం లేవని వరి ధాన్యం కొనుగోలు జరుగుతున్న. కావలసినన్ని గిన్ని బ్యాగులు సమకూర్చి ధాన్యం కాంటను వేగవంతం చేయాలని కాంటవేసిన ధాన్యాన్ని తరలించే లారీలు. ట్రాక్టర్లను హమాలీల కొరత మరియు కొనుగోలు కేంద్రంలో లేకుండా చూడాలని అటు రైస్ మిల్లర్ల వద్ద తరుగు తేమ పేరుతో దోపిడీకి గురవుతున్న రైతన్నను తక్షణమే ఆదుకోవాలని రైతుకు ఒక గింజ ధాన్యం నష్టం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతుల కోరారు కాంటలై నెలలు గడుస్తున్న డబ్బులు పడడం లేదని రైతుల ఆరోపించారు సంఘటన స్థలానికి ఎస్సై అనిల్ కుమార్ చేరుకొని రైతులకు సర్దుబాటు చెప్పి ధర్నా విరవింప చేశాడు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు

# సికింద్రాబాద్ బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఏసీబీ దాడులు



మేకార్తి దినపత్రిక మే ప్రతినిధి

30 వేల లంచం తీసుకుంటూ మహిళా ఎస్సై నందిత రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడింది.కేసు సెటిల్‌మెంట్ పేరుతో బాధితుల నుంచి లంచం డిమాండ్ చేసిన ఎస్సై.కానిస్టేబుల్ విజయ్‌తో కలిసి నగదు. స్వీకరిస్తుండగా ఏసీబీ ఎంట్రీ. ఏసీబీ డీఎస్పీ చలసాని శ్రీధర్ ఆధ్వర్యంలో ఆపరేషన్.పోలీస్ స్టేషన్‌లోనే గంటల పాటు సోదాలు. సిబ్బంది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు. అవినీతి ఆరోపణలతో పోలీస్ శాఖలో కలకలం.పూర్తి వివరాలు సేకరిస్తున్న ఏసీబీ అధికారులు.బోయిన్‌పల్లి పీఎస్ ఘటనతో సికింద్రాబాద్‌లో సంచలనం.

# లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో దొంగతనానికి పాల్పడిన వ్యక్తి అరెస్టు చేసి రిమాండ్ తరలింపు.

**- వివరాలు వెల్లడించిన సిరిసిల్ల రూరల్ సి.ఐ నాగేశ్వరరావు.**

మేకార్తి దినపత్రిక మే 20 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

నిందుతుని వివరాలు. 1.చైతన్య మణికంఠ,తండ్రి ఆంజనేయులు,వయసు 21 సం..లు,ఒంగోలు జిల్లా,పోర్సిపాడు మండలం మ్యాదరమెట్ల గ్రామం.ప్రస్తుతం వేములవాడ ,తేలుకుంట ఇంద్రనగర్ గ్రామం (అగ్రహారం).ఈసందర్భంగా సి.ఐ మాట్లాడుతూ....ఒంగోలు జిల్లా,పోర్సిపాడు మండలం మ్యాదరమెట్ల గ్రామానికి చెందిన చైతన్య మణికంఠ, తండ్రి ఆంజనేయులు,వయసు 21 సం..లు అనే వ్యక్తి ప్రస్తుతం వేములవాడలో,తేలుకుంట ఇంద్రనగర్ గ్రామం (అగ్రహారం) లో ఉంటూ కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు.చైతన్య మణికంఠ కూలి పని వచ్చే డబ్బులు తన యొక్క జల్సాలకు సరిపోకపోవడంతో దొంగతనం చేసి డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. గతంలో కూడా బోయినపల్లి , జమ్మికుంట ఏరియాలలో దేవాలయాల్లో దొంగతనం చేసి పోలీసు వారికి దొరికి జైలు జీవితం కూడా గడిపాడు.అయినా కూడ చైతన్య మణికంఠ లో ఎలాంటి మార్పు రాకుండా మళ్ళీ దొంగతనం చేయాలని నిర్ణయనిచుకొని తన దగ్గరి బంధువులైన బోదాసు యాదగిరి, తండ్రి రాములు గ్రామం బస్వాపూర్ మండలం కొహెడ, కొమిరె శ్రీను ,తండ్రి వెంకటయ్య, గ్రామం బద్ది పడగ,మండలం నంగునూరు, వారితో కలిసి ఒక ముఠాగా ఏర్పడి దొంగతనం చేయాలని నిర్ణయించుకొని తేదీ:-21-01-2026 రోజున మధ్యాహ్నం సమయంలో ముగ్గురు ద్విచక్ర వాహనంపై తంగళ్ళపల్లి గ్రామానికి వచ్చి ఊరిలో ఏదైనా దొంగతనం చేయడానికి రెక్కీ చేయగా, గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం చూసి గుడిలో దొంగతనం చేయాలని ముగ్గురు నిర్ణయించుకుని,మరుసటి రోజున తెల్లవారుజామున ముగ్గురు గుడిపైకి వెళ్లి గుడి పక్కన ఉన్న యాగశాల యొక్క తలుపు తాళం బండరాయితో పగలగొట్టి అందులో ఉన్న పంచలోహ గరుడ వాహనాన్ని తీసుకొని బైకుపై వెళ్ళినారు.ఆలయ పూజారి తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేయగా తంగళ్ళపల్లి ఎస్.ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా,తేదీ: 19-05-2026 రోజున మధ్యాహ్నం ఎస్ఐ ఉపేంద్ర




చారి తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, చైతన్య మణికంఠ ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం సిద్ధిపేటకు వెళ్తుండగా పాత నేరస్థుడు కావడంతో అనుమానం వచ్చి విచారించగా,తాను మరో ఇద్దరితో కలసి దొంగతనం చేసినట్టుగా ఒప్పుకున్నాడు. చైతన్య మణికంఠ ద్విచక్ర వాహనం సీజ్ చేసి రిమాండ్ కి తరలించడం జరిగిందని,పరారీలో ఉన్న మిగితా ఇద్దరు నిందుతులను త్వరలో పట్టుకుంటమని రిమాండ్ చేస్తామని సి.ఐ తెలిపారు.నిందుతున్ని పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్.ఐ ఉపేంద్ర చారి, హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, కానిస్టేబుల్ సంపత్, శ్రావణ్ లను సి.ఐ అభినందించారు.

# బెంగాల్ రాజకీయాల్లో సంచలనం: మళ్లీ కీలక బాధ్యతల్లోకి దమయంతి సేన్

మేకార్తి దినపత్రిక మే 20 ప్రతినిధి

ప్రస్తుతం బెంగాల్ రాజకీయాలు, పరిపాలన, పోలీస్ వ్యవస్థల గురించి దేశవ్యాప్తంగా పెద్ద చర్చ జరుగుతున్న సమయంలో మళ్లీ ప్రధానంగా వినిపిస్తున్న పేరు మాజీ ఐపీఎస్ అధికారి .ఒకప్పుడు రాజకీయ ఒత్తిళ్లను లెక్కచేయకుండా పనిచేసిన ధైర్యవంతమైన పోలీస్ అధికారిణిగా గుర్తింపు పొందిన ఆమె ఇప్పుడు మళ్లీ కీలక బాధ్యతల్లోకి రావడం కేవలం ఒక పరిపాలనా నిర్ణయం మాత్రమే కాదు... బెంగాల్ రాజకీయాల్లో మారుతున్న శక్తిసమీకరణాలకు ఒక పెద్ద సంకేతంగా కూడా చాలామంది చూస్తున్నారు రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ , మైనారిటీ మహిళలపై జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్న హింస, దాడులు, వేధింపులపై దర్యాప్తు చేయడానికి సీఎం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీలో ఆమెను "మెంబర్ సెక్రటరీ"గా నియమించడం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో కూడా చర్చకు దారితీసింది 2012లో కోల్‌కతాలో జరిగిన "పార్క్ స్ట్రీట్ గ్యాంగ్ రేప్ కేసు" భారతదేశంలో మహిళల భద్రతపై పెద్ద చర్చకు దారితీసిన ఘటనల్లో ఒకటి. ఆ సమయంలో దేశవ్యాప్తంగా మహిళలపై నేరాలపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అలాంటి సమయంలో పార్క్ స్ట్రీట్ ఘటన వెలుగులోకి రావడం బెంగాల్ ప్రభుత్వాన్ని తీవ్ర ఒత్తిడిలోకి నెట్టింది. అయితే అప్పటి రాజకీయ వాతావరణం ఈ కేసును మరింత వివాదాస్పదంగా మార్చింది. ఘటన తీవ్రతను తగ్గించి చూపేందుకు ప్రయత్నాలు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. కొందరు ఈ ఘటనను రాజకీయంగా ఉపయోగించుకునేందుకు సృష్టించిన కథగా కూడా పేర్కొన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కోల్‌కతా పోలీస్ డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్ చీఫ్‌గా ఉన్న దమయంతి సేన్ మాత్రం రాజకీయ ఒత్తిడులకు తలవంచకుండా విచారణను ముందుకు తీసుకెళ్లారు. బాధితురాలి వాంగ్మూలాన్ని సీరియస్‌గా తీసుకుని, ఫోరెన్సిక్ ఆధారాలు, సాంకేతిక సాక్ష్యాలు, ప్రత్యక్ష సాక్షుల వివరాలతో కేసును బలపరిచారు. నిందితులను



గుర్తించి అరెస్ట్ చేయడమే కాకుండా కేసును చట్టపరంగా నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించారు. అప్పట్లో ఆమె పనితీరును దేశవ్యాప్తంగా మీడియా, మహిళా సంఘాలు, న్యాయవాదులు ప్రశంసించారు.అయితే అదే నిజాయితీ ఆమెకు రాజకీయంగా ఇబ్బందులు తెచ్చిందనే అభిప్రాయం అప్పట్లో బలంగా వినిపించింది. కేసు విచారణలో ప్రభుత్వానికి అసౌకర్యంగా మారే అంశాలు బయటకు రావడం ప్రారంభమైన తర్వాత ఆమెను కోల్‌కతా పోలీస్‌లోని కీలక బాధ్యతల నుండి తొలగించి బరాక్‌పూర్ పోలీస్ ట్రైనింగ్ కాలేజీకి బదిలీ చేశారు.సాధారణంగా ఫీల్డ్‌లో కీలక దర్యాప్తులు చూసే అధికారులను ట్రైనింగ్ పోస్టులకు పంపడాన్ని చాలా సందర్భాల్లో "లూప్ లైన్ పోస్టింగ్"గా భావిస్తారు. అందుకే అప్పట్లో చాలామంది దీనిని "నిజాయితీగా పనిచేసిన అధికారిపై రాజకీయ కక్ష సాధింపు"గా అభివర్ణించారు. సోషల్ మీడియాలో కూడా "నిజం కోసం పనిచేసిన అధికారులకు ఇదే బహుమతా" అనే చర్చ బలంగా నడిచింది. అయినప్పటికీ దమయంతి సేన్ ఎక్కడా వెనక్కి తగ్గలేదు. ఎలాంటి రాజకీయ వివాదాల్లోకి వెళ్లకుండా తన వృత్తిపరమైన నిబద్ధతను కొనసాగించారు. చివరకు సీనియర్ ఐపీఎస్ అధికారిణిగా పదవీ విరమణ పొందారు. ఇప్పుడు సువేందు అధికారి ప్రభుత్వం ఆమెను మళ్లీ కీలక బాధ్యతల్లోకి తీసుకురావడం చాలా పెద్ద రాజకీయ, పరిపాలనా సందేశంగా భావిస్తున్నారు. ప్రస్తుతం బెంగాల్‌లో మహిళల భద్రత, వెనుకబడిన వర్గాలపై దాడులు, రాజకీయ హింస, పోలీస్ వ్యవస్థపై రాజకీయ ప్రభావం వంటి అంశాలు తరచూ చర్చకు వస్తున్నాయి. అలాంటి సమయంలో ప్రజల్లో నమ్మకం ఉన్న, రాజకీయ ఒత్తిళ్లకు లొంగని అధికారిణిని తిరిగి వ్యవస్థలోకి తీసుకురావడం ద్వారా ప్రభుత్వం ఒక స్పష్టమైన సంకేతం ఇవ్వాలని ప్రయత్నిస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ కమిటీ పని కేవలం ఫిర్యాదులు స్వీకరించడం మాత్రమే కాదు. మహిళలపై జరిగిన దాడులపై నిజ నిర్ధారణ, పోలీస్ వ్యవస్థ స్పందనపై సమీక్ష, బాధితులకు న్యాయం అందే విధానాలపై సూచనలు, అవసరమైతే బాధ్యులపై చర్యలకు సిఫార్సులు చేయడం వంటి కీలక బాధ్యతలు కూడా ఈ కమిటీ పరిధిలో ఉండనున్నాయని సమాచారం. అందుకే దమయంతి సేన్ నియామకం ఇప్పుడు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. చాలామంది ఈ నిర్ణయాన్ని ఒక రాజకీయ సందేశంగా కూడా విశ్లేషిస్తున్నారు. "పోలీస్ వ్యవస్థ రాజకీయాలకు బానిస కాకూడదు", "బాధితులకు న్యాయం ముఖ్యమని ప్రభుత్వం చెప్పాలనుకుంటోంది", "మహిళల భద్రతపై కఠిన వైఖరి అవసరం", "పరిపాలనలో పారదర్శకత పెరగాలి" అనే సంకేతాలను ప్రభుత్వం ఇవ్వాలని చూస్తోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు మహిళా సంఘాలు, సామాజిక సంస్థలు, మాజీ పోలీస్ అధికారులు కూడా దమయంతి సేన్ పునరాగమనాన్ని స్వాగతిస్తున్నారు. "తప్పు చేసిన వారు ఎంతటి ప్రభావశీలులు అయినా చట్టం ముందు నిలబడాల్సిందే" అనే నమ్మకాన్ని ఆమె మళ్లీ తీసుకువస్తారని చాలామంది భావిస్తున్నారు. ఇప్పుడు అందరి చూపు ఈ ప్రత్యేక కమిటీ పనితీరు మీదే ఉంది. బెంగాల్‌లో నిజంగా పరిపాలనా పారదర్శకత పెరుగుతుందా బాధితులకు న్యాయం జరుగుతుందా పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం తిరిగి పెరుగుతుందా అనే ప్రశ్నలకు రాబోయే రోజుల్లో సమాధానాలు దొరకనున్నాయి.

# రేపటి నుంచి కాళేశ్వరంలో అంత్య పుష్కరాలు

మేకార్తి దినపత్రిక మే ప్రతినిధి

భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో సరస్వతీ నది అంత్య పుష్కరాలు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఇవాళ రాత్రి పుష్కర కాలం మొదలవుతుంది. తెల్లవారుజామున 5.30 గంటలకు పుష్కర స్నానాలు ప్రారంభిస్తారు. ప్రభుత్వం రూ.30 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి ఏర్పాట్లు పూర్తి చేసింది. దాదాపు 40 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆర్టీసీ 3,360 బస్సులు నడపనుంది. గవర్నర్, సీఎం, మంత్రులకు ఆహ్వానాలు అందాయి.



PRINTED,PUBLISHED & OWNED BY MEKARTHI SRINIVAS, Printed at SUNDAY PRINTING PRESS, H.No. 3-4297, SARASWATHI COMPLEX,SVN COLONY GUNTUR,ANDHRA PRADESH-522006.& Published from H.No. 12-166, RAJIV NAGAR,MUSTABAD, RAJANNA SIRICILLA DISTRICT-505404 TELANAGNA,.
RNI No.TGTEL /25/A2356,Editor : MEKARTHI SRINIVAS, Cell: 9014726022.e-mail: MEKARTHI DINAPATRIKA@gmail.com